సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా సురేష్

విశాలాంధ్ర-వెలిగండ్ల : కనిగిరి నియోజకవర్గ సర్పంచ్ సంఘం అధ్యక్షులుగా వెలిగండ్ల సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం కనిగిరిలోని వైయస్సార్ భవన్ నందు శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ వైసిపి కార్యకర్తలు, నాయకులు, సర్పంచుల సర్పంచులతో సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో వెలిగండ్ల సర్పంచిని ఏకగ్రీవంగా నియోజకవర్గ సర్పంచుల సంఘం అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ సర్పంచుల సంఘం అధ్యక్షునిగా ఎన్నిక చేసిన ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్‌కి రుణపడి ఉంటానని ఆయన అడుగుజాడల్లో నడుస్తానని మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర
ప్రకాశం, బాపట్ల జిల్లాలు

ఆమంచిని కలసిన ఆకుపాటి

విశాలాంధ్ర-పామూరు : పర్చూరు నియోజకవర్గ వైసిపిఇన్చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమంచి కృష్ణమోహన్‌ని పామూరు పట్టణ రెండవ ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువ సత్కరించి అభినందనలు తెలిపారు. కార్య క్రమంలో నీరు కట్టు నాయబ్ రసూల్ మండల (వైఎస్ ఆర్సిపి ప్రచార కమిటీ అధ్యక్షులు) తాడి పత్రి మాలాద్రి రెడ్డి, నారాయణ,పుప్పాల రామ్మూర్తి,కటకం భాను తదితరులు పాల్గొన్నారు.

ఆమంచి కృష్ణమోహన్‌కు అభినందనలు తెలుపుతున్న ఆకుపాటి వెంకటేష్

భూముల రీసర్వే వేగవంతంగా పూర్తిచేయాలి

జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

పీసీపల్లి

కనిగిరి

విశాలాంధ్ర-పీసీపల్లి : పది రోజులలోపు భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పెదఅలవలపాడు సచివాలయంలో బుధవారం రెవెన్యూ అధికారులకు భూముల రీసర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మొదట విడతలో రాష్ట్రంలో 2000 గ్రామాలకు గాను పీసీపల్లి మండలంలో గోసి గుండాల పిచ్చిగుంటపల్లి గ్రామాలలో రీ సర్వ పూర్తికాలేదని రెండో విడత 2000 గ్రామాలకుగాను మండలంలో చౌట గోగులపల్లి ముద్దపాడు గ్రామాలు రీ సర్వేలో వెనుకబడి ఉన్నాయని మొదట విడత రిసర్వే పెండింగ్ ఉన్న గ్రామాలైన గోసిగుండాల పిచ్చిగుంటపల్లి గ్రామాలలో రీసర్వే పూర్తి చేయడం జరిగిందని తెలియజేశారు. అధికారులు గ్రామస్తులతో మమేకమై వేగంగా సర్వే ప్రక్రియను పూర్తి చేసి నివేదికలు అందజేయాలని ఆర్డిఓ సందీప్ కుమార్ కు ఆదేశించారు. అనంతరం పెదఅలవలపాడు సచివాలయంలోని అధికారులతో మాట్లాడారు సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాలేటి పల్లి రిజర్వాయర్ త్వరగా పూర్తి చేయాలని ప్రాజెక్ట్ నిండా నీళ్లు ఉన్న వృధాగా పోతున్నాయని వేల ఎకరాల మాగాణి భూములు బీడు భూములగా ఉన్నాయని కాలువలను పూర్తి చేసి రైతులకు నీళ్లు విడుదల చేయాలని విలేకరులు జాయింట్ కలెక్టర్ ను వివరణ కోరగా వెంటనే స్పందించి పారేటిపల్లి రిజర్వాయర్ పనులను పరిశీలించాలని ఆర్డీవోని ఆదేశించారు. ఆర్డిఓ సందీప్ కుమార్ తహసిల్దార్ మండల అధికారులు పచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనధికార వెంచర్లలో హద్దురాళ్లు తొలగింపు

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరిలోని మున్సిపాలిటీ పరిధిలోని 870 సర్వే నెంబర్లలో 1.70 సెంట్ల అనధికార వెంచర్లను జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ ఏకిషోర్ మంగళవారం పరిశీలించారు. పొదిలి రోడ్డులో ఉన్న అసైన్మెంట్ భూముల్లో లేఅవుట్లు వేసిన ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. రెవిన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి అసైన్మెంట్ వెంచర్ లోని ప్లాట్ల హద్దురాలను తొలగింప చేశారు.

జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, పామూరు మండలాల్లో పట్టా భూములు, ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా అనధికార వెంచర్లు వేసినట్లు గుర్తించామన్నారు. వ్యవసాయ భూములను కన్వర్షన్ లేకుండా లే అవుట్లు వేయడం, కన్వెన్షన్ అయిన తర్వాత కూడా అనుమతులు తీసుకోకపోవడం చట్టరీత్యా నేర మన్నారు. అసైన్మెంట్ భూముల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లేఅవుట్లు వేసిన వారికి నోటీసులు జారీచేసి ఆ భూములను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. కనిగిరిలోని ప్రజలు కూడా అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దని జాయింట్ కలెక్టర్ సూచిం చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిదారి సందీప్ కుమార్, తహసిల్దార్ పుల్లారావు, కమిషనర్ డివిఎస్ నారాయణరావు, ఎంపీడీవో మల్లికార్జున రావు, సర్వేయర్ బ్రాహ్మణయ్య, వీఆర్వోలు, రెవెన్యూ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పథకాలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శం

ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర-పామూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అన్ని రాష్ట్రాలకు ఆదర్శనీయమని కనిగిరి శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ చెప్పారు. బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో గృహ సారధుల సమావేశం వైసిపి మండల అధ్యక్షులు గంగసాని హుసేన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుర్ర మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో దోసుకొని దాచుకోవడం చంద్రబాబు నాయుడు దగ్గర నుండి స్థానిక తెలుగుదేశం నాయకులు వరకు జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయికిరణ్, జడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ కాజా నాయబ్ రసూల్, వైసీపీ గంధం యేసు రత్నం, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, మాజీ జెడ్పిటిసి మెదబలిమి గురవయ్య, షేక్ చాంద్ బాషా (సెంట్రింగ్ బుజ్జి), ఎంపీటీసీ అబ్దుల్, కందుల శ్రీనివాసులురెడ్డి, గట్ల విజయభాస్కర్‌రెడ్డి, స్వయంకృషి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

భైరవకోనను సందర్శించిన ఎస్పీ దంపతులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి గాంచిన పర్యాటక కేంద్రమైన ప్రముఖ శైవక్షేత్రమైన భైరవకోన దేవస్థానాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ మలిక గర్గ్ మరియు బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ కుటుంబ సభ్యులతో సతీ సమేతంగా భైరవకోనను సందర్శించారు. బుధవారం ఎస్పీ కుటుంబ సభ్యులు సీఎస్‌పురం మండలంలోని భైరవకోనలో ఉన్న భైరవేశ్వరస్వామిని సందర్శించి భైరవకోనలో ఉన్న త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ కార్య నిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సిద్దు రమణారెడ్డి, అర్చకులతో పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనాంతరం ఎస్పీ దంపతులకు శ్రీ స్వామివారి శేషవస్త్రములతో సత్కరించి ఆశీర్వాదాలు అందజేశారు. భైరవకోనలో జిల్లా ఎస్పీ మలిక గర్గ్ కుటుంబ సభ్యులు ఎంతో సంతోషంగా గడిపారు. ఈ సందర్భంగా అర్చకులతో భైరవకోన ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఇ నారాయణస్వామిరెడ్డి, కనిగిరి, పామూరు సీఐ పాపారావు, ఎ శ్రీనివాసరావు, సీఎస్‌పురం హెచ్‌ఎం పాడు ఎస్ఐలు పి అనీల్‌కుమార్, జి.క్రిష్ణపావని పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులను కార్డుదారులందరికీ పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-కనిగిరి : ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్డు దారులకు నిత్యవసర వస్తువులు ఇంటి వద్ద పంపిణీ చేయాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ కఫార్ అన్నారు. మంగళవారం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శంకవరం గ్రామంలో మొబైల్ వాహనం పంపిణీ చేసే నిత్యవసర వస్తువులను తనిఖీ చేసి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక దుకాణాలు దారులు సరుకు సరైన సమయంలో సరఫరా చేయకపోవడంతో వాటివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ప్రజలు సౌకర్యార్థం ప్రభుత్వం నిత్యవసర సరుకులును మొబైల్ వాహనం ద్వారా ఇంటి వద్దకే అందించే విధానం ప్రవేశపెట్టినరన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పెన్నా ఏడుకొండలు, మస్నూర్, శానిటరీ సెక్రెటరీ రమణారెడ్డి వార్డు ప్రజలు ఉన్నారు.

క్రమ శిక్షణతో కూడిన విద్యతో ఉన్నతస్థాయి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : క్రమ శిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థాయికి చేరుస్తుందని విశ్రాంత ఉపాధ్యాయులు మద్దుల సుబ్బారెడ్డి, కాల్వ శ్రీనివాసులు, ఓ సత్యనారాయణ, పి. శివప్రసాద్, కొండా సుబ్బారెడ్డి, అల్లా బకాష్‌లు అన్నారు. మండలంలోని పిటికాయగుల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 1987-88 పదవ తరగతి విద్యార్థుల పూర్వ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దిన ఫలితం ప్రస్తుతం మీ స్థాయిని తెలియజేస్తుందని ప్రశంసించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు తల్లిదండ్రులుగా పూర్వ విద్యార్థులు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. భవిష్యత్తులో సామాజిక సేవలో పాలుపంచుకోవాలని పూర్వ విద్యార్థులను విశ్రాంత ఉపాధ్యాయులు కోరారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులకు విద్యార్థులకు ప్రత్యేకంగా మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ఏపీ హమాలి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి సుభాన్ నాయుడు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సుభాన్ నాయుడు

విశాలాంధ్ర-ఒంగోలు : ఏపీ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి సుభాన్ నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక మల్లయ్య లింగం భవనంలో ఏపీ హమాలీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాన్ నాయుడు మాట్లాడుతూ ఏఐటీయూసీ అనుబంధ ఏపీ హమాలీ ఫెడరేషన్ ఈనెల 29 30, 31వ తేదీలలో తిరుపతి నగరంలో భారీ ఎత్తున జరుగుతున్నాయన్నారు. తరతరాలుగా ముఠా కార్మికులకు, ఎప్పుడు దించుడు కూలీలకు ఎటువంటి చట్టాలు గాని హక్కులు గాని ప్రభుత్వాలు కల్పించ లేదన్నారు. కేవలం అంగళ్ళ యాజ మాన్యాలతో రెండేళ్లకు మూడేళ్లకు అగ్రిమెంట్ చేసుకోవడం యాజ మాన్యాలతో బ్రతకడమే వీరికి సాంప్రదా యంగా వస్తుందన్నారు. దేశంలో వ్యవసాయ రంగం, నిర్మాణరంగం తర్వాత అతి పెద్ద రంగమైన హమాలీ రంగాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకపోవడం దుర్మార్గమన్నారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలతో రోజంతా కష్టించి పనిచేసిన ఇల్లు గడవని పరిస్థితి, పిల్లలకు చదువులు చెప్పించుకోలేని పరిస్థితి నెలకొంది అన్నారు. కరోనా కారణంగా దేశంలో నిర్మాణ పనులు తగ్గటంతో హమాలీల పనులు కూడా తగ్గాయన్నారు. నడుములు వొంగిపోవడం, మోకాళ్లు వంకర్లు తిరగడం, నొప్పులు రావడం, మోకాళ్ళ చిప్పలు అరిగిపోవడం వంటి వ్యాధులతో కార్మికులు 50 సంవత్సరాల వయసుకే ముసలి వాడిగా మారిపోతున్నారు అన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పివిఆర్ చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వమే తూనికల కొలతల శాఖ ద్వారా బరువుకు తగ్గట్టుగా కూలి రేట్లు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. హమాలి కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. అలాగే 50 సంవత్సరాలకే కార్మికులకు రూ.5 వేలు వంతున పింఛన్ ఇవ్వాలన్నారు. ఈనెల 29వ తేదీ న తిరుపతి నగరంలో జరిగే భారీ బహిరంగ సభకు హమాలీ కార్మికులు, ముఠా వర్కర్స్ భారీ ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ డి సర్దార్, సీనియర్ నాయకులు అందే నాసరయ్య పాల్గొన్నారు.

అండర్ ఆర్డర్ 21 రూల్ 54 ఆఫ్ సి.పి.సి
కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.p. No: 4/2019 O.S.No: 72/2015

జొన్నలగడ్డ శ్రీ ఆంజనేయులు – D.H.R
Vs
వంట్రామూర్తెయ్య (Died) వగైరాలు – J.D.Rs

టు,
1) వంట్రా పెద కాశయ్య, S/o. మూరైయ్య, R/o. ఎలికవారి పల్లె గ్రామం H/o. తిమ్మారెడ్డి పల్లె H.M. పాడు మండలం, ప్రకాశం జిల్లా.
2) జడబోయిన గంగమ్మ, W/o. శ్రీను D/o. వంట్రా మూరైయ్య, R/o. పాత మల్లాపురం గ్రామం, పిటకగుల్ల పోస్టు, బేస్తవారిపేట మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు E.p. లో శ్రీకోర్టు వారు మీకు నోటీసులు పత్రికా ముఖంగా ఆదేశించి యున్నారు. కావున మీరు తేది :19-01-2023 దిన ఉదయం గం॥ 10.30ని॥లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా కాని లేదా మీ ప్లీడరు ద్వారా కాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనిచో మీ పరోక్షమున E.p. తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
వాయిదా తేది : 19-01-2023
(By Order Of Court)
నాయబ్ రసూల్ షేక్
DHR తరఫున అడ్వకేట్,
కనిగిరి, ప్రకాశం జిల్లా

యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు : ఏపి మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయుసి అనుబంధం) క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి వచ్చే రోగులకు వైద్య సేవలను సక్రమంగా అందించాలని, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. అలాగే ప్రభుత్వం కూడా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆలోచన చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఉద్యోగులు కలెక్టర్ దృష్టికి తీసుకు పోయారు. ఈ కార్యక్రమంతో ఏఐటీయుసి జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌డి సర్దార్, ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.బ్రహ్మానాయుడు, ఉపాధ్యక్షులు పి.చినరాయుడు, డి వెంకట్రావు, పి.అశోక్ బాబు, ప్రధాన కార్యదర్శి పి. సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ ప్రసాదరావు, కోశాధికారి వై శ్రీనివాసరావు, కార్యదర్శులు మణిబాబు, వందనం, రమణనాయక్, వలి, మంత్రునాయక్ పాల్గొన్నారు.

బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 'క్విస్' విద్యార్థినికి బంగారు పతకం

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ సంవత్సరము సిఎస్‌ఐటీ చదువుతున్న లక్ష్మీ ప్రియాంక ఈనెల 7 తేదీ నుండి నుండి 9తేదీ వరకు ప్రకాశం జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సౌత్ ఇండియా బాక్సింగ్ పోటీలలో దక్షిణ భారత రాష్ట్రాల నుండి వచ్చిన వివిధ కీడాకారిణిలతో పోటీపడి బంగారు పతకం సాధించి నట్లు క్విస్ విద్యా సంస్థల చైర్మన్ నిడమానూరు నాగేశ్వరరావు, సెక్రెటరీ సూర్య కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యను చదువుతూ బాక్సింగ్ కీడలో ఆధునిక మెలకువలను నేరుకోని రాణిసూ ఎంతో ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షిస్తునట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.వి. హను మంతరావు, ఇతర అధ్యాపకులు క్రీడాకారిణిని అభినందించారు.

విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ హనుమంతరావు

సచివాలయ కన్వీనర్‌గా సుబ్రమణ్యం

విశాలాంధ్ర-వెలిగండ్ల : సచివాలయ మండల కన్వీనర్‌గా మాజీ సింగల్ విండో అధ్యక్షులు పోల్లా సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. బుధవారం కనిగిరిలోని వైయస్సార్ భవన్ నందు ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ సమీక్ష సమావేశంలో జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పిటిసి రామణ తిరుపతిరెడ్డి, డాక్టర్ పేరుగు మురళీకృష్ణ సలహా మేరకు వెలిగండ్ల మండల సూపరిచితులు వైయస్సార్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి, బుర్ర మధుసూదన్ యాదవ్ గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసి మండలంలో పార్టీ విజయ వంతం అయ్యేందుకు అలుపెరగని వ్యక్తి పోల్లా సుబ్రమణ్యం ఆయన సేవలను గుర్తించి శాసనసభ్యులు మరోసారి పార్టీ అభివృద్ధి కొరకు కన్వీనర్‌గా ఇచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి సచివాలయ కన్వీనర్‌గా నియమించి నందుకు ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్‌కి, వైయస్సార్సీపి మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు నాగూర్ యాదవ్, జార్జ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు దేవా సహాయం, సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, బిసి సెల్ అధ్యక్షులు యేలిక రమణయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన జేమ్స్, దాదా సోమయ్య, గిద్ద బ్రహ్మయ్య, సర్పంచ్‌లు శ్యామల కృష్ణారెడ్డి, తాతపూడి సురేష్ బాబు, మండల ప్రధాన కార్యదర్శి గంజి రవీంద్ర రెడ్డి, కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెస్ రాజు అక్రమ అరెస్టు దుర్మార్గం

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్.సి. సెల్ అధ్యక్షులు ఎమ్మెస్ రాజుని అరెస్టు చేయడందుర్మార్గమని టిడిపి ఎస్సి సెల్ నాయకులు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఒంగోలు పార్లమెంట్, నియోజకవర్గ ఎస్.సి.సెల్ నాయకులు మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ముసునూరులో దళిత యువకుడిని చంపినందుకు పరామర్శించడానికి వెళుతున్న ఎమ్మెస్ రాజుని అరెస్టు చేసి ఎక్కడికి తీసుకుని వెళ్లారో తెలియక భయాందోళనకు గురిచేసిన పోలీస్ చర్యలపై తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్సీలపై ఇకనైనా దాడులు ఆపకపోతే రాబోయే రోజుల్లో ఎస్సీల ఆగ్రహానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని నాయకులు అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు ఇవ్వకుండా ఎస్సీల జీవితాలను అంధకారంలో నెట్టిన జగన్మోహన్ రెడ్డికి తగిన విధంగా బుద్ధి చెబుతామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎస్సీ కార్పొరేషన్ నిధులు దారి మళ్ళించకుండా ఎస్సీలకు ఇవ్వాలని మాట్లాడారు.ఒంగోలు నియోజకవర్గంలో ఒక దామచర్ల జనార్ధనరావు ద్వారానే అభివృద్ధి జరిగిందని వైఎస్ఆర్సిపి నాయకుడు ఐదుసార్లు ఎమ్మెల్యేగా రెండుసార్లు మినిస్టరుగా చేసిన నియోజకవర్గాన్ని 10 శాతం కూడా అభివృద్ధి చేయలేదని తెలియజేశారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో, మీ హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో చర్చకు సిద్ధమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చుండి శ్యామ్, నావూరి కుమార్, గొల్లపూడి బాబురావు, కసుకుర్తి అంకరాజు, పాటిబండ్ల రాజశేఖర్, కోటపూరి చిరంజీవి, అట్లూరి వెంకటేశ్వర్లు, మేరీ నిరీక్షణ కుమారి, కనుమూరు సుబ్బారావు, ఆబోతు నారాయణ పాల్గొన్నారు.

Sec 5 of Limitation Act ప్రకారం నోటీసు
మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు
జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.142/2021 in A.S.11/2018

Vutukuri Malleswara Rao (Died)
LRs Vutukuri Syamala Devi & Others - Petitioners/Appellants
Vs
1. Gontla RadhaKrishnaiah (Died) his
2. Vutukuri Mallikarjuna Rao & Others - Respondents

To,
(R8) Gontla Bhagyalakshmi W/o. Ranga Rao Aged 49 Years Hindu House wife
(R11) Gontla Sridevi D/o. Late Radha Krishnaiah Aged 43 Years. Hindu, Housewife Both are C/o. Gontla Chakrapani R/o. Opp to Ammavari Sala. Rajaji Street, Markapuram-Town Prakasam (District)

పై నెంబరు అప్పీలు దావాలో 1వ రెస్పాండెంటు Gontla Radharishnaiah చనిపోయినందున, ఆయన వారసులుగా మిమ్ములను చేర్చుమని,LR పిటీషను, Abalement set aside పిటీషను, దాఖలు చేయుటలో జరిగిన 210 రోజుల ఆలస్యమును మన్నించమని Sec 5 of Limitation Act ప్రకారం పిటీషను దాఖలు చేసినందున ఇందు విషయమై మీకు పలు పర్యాయములు నోటీసులు పంపగా అవి మీకు ముట్టని కారణముచేత, ఈ దినపత్రిక నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా 30-01-2023వ తేది ఉదయం 10.30 గంటలకు పైకోర్టులో, స్వయముగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసినది లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.
వాయిదా తేది : 30-01-2023
కోర్టు వారి అనుమతితో
వి. శ్రీనివాసరావు
అడ్వకేట్, పిటీషనర్లు/ అప్పీల్స్

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-వేటపాలెం : మండలంలోని దేశాయిపేట పంచాయతీ నీలకంఠపురంలో ఉన్న అనాథ వృద్ధ శరణాలయ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా దేశాయిపేట పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు రాబోయే రోజులలో కూడా నిర్వహిస్తామని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, ఈవోఆర్డీ, పంచాయతీ ప్రత్యేకాధికారి కె. శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, ఆశ్రమ కన్వీనర్ డా. సత్రం మల్లేశ్వరరావు, అధ్యక్షులు గుత్తి విశ్వేశ్వరరావు, కోశాధికారి గ్నుం రంగనాయకులు, జోగేశ్వరరావు, గురునాధం తదితరులు పాల్గొన్నారు.

13న అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

సర్పంచ్ బొనిగల ఎలిశమ్మ

విశాలాంధ్ర-కొరిశపాడు : మండలంలోని మేదరమెట్ల గ్రామంలో ఈ నెల 13వ తేదీన జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలలో టిటిడి చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి పాల్గొంటారని సర్పంచ్ బొనిగల ఎలిసమ్మ మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. గ్రామంలో టిటిడి కళ్యాణ మండపం, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం, సెంట్రల్ లైటింగ్ ప్రారంభోత్సవం సుబ్బారెడ్డి చేతుల మీదుగా జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. అలాగే టిటిడి చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి, భద్రారెడ్డి, అద్దంకి వైఎస్ఆర్ పార్టీ ఇంచార్జ్ బాచిన కృష్ణ చైతన్యల చేతుల మీదగా జల జీవన్ ద్వారా ఇంటింటికి నీటి కొళాయికి శ్రీకారం చుడుతున్నట్లు సర్పంచ్ తెలియజేశారు. కావున ఈ కార్యక్రమాలలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

విశాలాంధ్ర-అద్దంకి : పేద,బడుగు, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని శాప్‌నెట్ చైర్మన్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ పరిధిలోని 7 వవార్డు గాజులపాలెం, గుర్రాలకాలనీలో కృష్ణచైతన్య పర్యటించి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజలకు చేరూరిన లబ్ధిని తెలియజేస్తూ ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకుంటూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎల్,ఎస్తేరమ్మ, వైస్‌చైర్మన్ దేసు పద్మేష్, కమీషనర్ రవికుమార్,వార్డు కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-అద్దంకి : ఈపంట నమోదును వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. బుధవారం మండలంలోని కొంగపాడు గ్రామంలో ఈపంట నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ ఈనెల 31లోపు రబీలో సాగుచేసిన పంట మొత్తం నమోదు పూర్తి చేయాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు.ఇప్పటి వరకు రబీలో 6800 ఎకరాలు సాగు అవ్వగా ఇప్పటి వరకు 5120 ఎకరాలు ఈపంట నమోదు చేశామని మండల వ్యవసాయాధికారి కె.వెంకటకృష్ణ తెలిపారు. ఈనెల 15వతేదీలోపు పి.యం కిసాన్ ఈకెవైసి పూర్తి చేయాలని, ఈకెవైసి చేయించుకోని రైతులకు పి.యం కిసాన్ అమౌంట్ జమ కాదని అబ్దుల్ సత్తార్ తెలియజేశారు.

లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండల కేంద్రమైన దోర్నాలలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బుధవారం ధనుర్మాసం పురస్కరించుకొని 21వ రోజున ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక కలిసి పూజలు నిర్వహించి, అలాగే కలిశ పూజ కుంకుమార్చన వదలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి కొండవీటి సుదర్శన చార్యులు, కొండవీటి సాయిలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేక అలంకరణగా నిర్వహించారు. భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని బుక్కాపురం ఎస్సీ కాలనీకి చెందిన కుమ్మరి కుంట్ల టీవి ప్రేమ కుమారికి బుధవారం ఉదయం పురిటి నొప్పులు రాగా 108కి సమాచారం అందించారు. సమాచారాన్ని అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఆమెను పామూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికం కావడంతో సుఖ ప్రసవం చేశారు. ప్రేమకుమారి పండంటి ఆడపిల్ల కి జన్మనిచ్చింది. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటి ఎం నారాయణ, పైలట్ వెంకటనారాయణలు తెలిపారు. సరైన సమయంలో మెరుగైన సేవా అందించినటువంటి 108 సిబ్బందిని పేషెంట్ తరపు బంధువులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ శివరాం మాట్లాడుతూ ఆపద సమయంలో 108 సేవలు తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు.

ఏబీసీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

పాల్గొన్న మద్దిశెట్టి రవీంద్ర

విశాలాంధ్ర-తాళ్లూరు : మండల కేంద్రమైన తాళ్లూరులోని ఏబిసి హై స్కూల్ నందు బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. దర్శి శాసనసభ్యులు డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరులు తాళ్లూరు మండల వైసిపి ఇన్చార్జ్ మద్దిశెట్టి రవీంద్ర సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సంక్రాంతి కేకును కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అదేవిధంగా భోగి మంటల కార్యక్రమాలు, చిన్నారులకు భోగి పళ్ళు వేసే కార్యక్రమం, హరిదాసుల కార్యక్రమాలు, సంప్రదాయ కోడిపందాల కార్యక్రమాల్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మన సాంప్రదాయ బద్ధమైన పండుగలను మర్చిపోకుండా పాఠశాల పరిధిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. పాఠశాల యాజమాన్యానికి, విద్యార్థులకు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మారం వెంకటరెడ్డి, ఎంపీపీ తాటి కొండ శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు మంచాల ప్రియాంక నాగార్జున రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు కరీముల్లా, తాళ్లూరు సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, రజానగరం సర్పంచ్ ఎస్కే కాలే షావలి, బెల్లంకొండ వారి పాలెం సర్పంచ్ పి సుమలత శ్రీకాంత్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి గురజాల సుబ్బ య్య, తాళ్లూరు ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ కే ఖాదర్ మస్తాన్ బి ,గంగవరం ఉపసర్పంచ్ వై కాశిరెడ్డి, వైసిపి నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, విశ్రాంత ఉపాధ్యా యులు ఐ. వెంకటరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, కరెస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ కాలేషాబాబు, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నకాలనీ లేఅవుట్ పరిశీలన

జగనన్న కాలనీ లేఔట్‌ను పరిశీలిస్తున్న మార్కాపురం సబ్ కలెక్టర్ సేధూమాధవన్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల: మార్కాపురం సబ్ కలెక్టర్ సేదుమాధవన్ బుధవారం పెద్దదోర్నాల మండలం పర్యటించి హసనబాధ గ్రామం వద్ద జగనన్న కాలనీ లేఅవుటును పరిశీలించారు. నివాసయోగ్యతగా లేదని అందులో ఇల్లు నిర్మించుకో బోమంటూ లబ్ధిదారులు పలుమార్లు అధికారులు దృష్టికి తెచ్చారు. ధర్నాలు కూడా చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమానికి రెండు రోజులుగా దోర్నాలలో ఇంటిం టికి పర్యటించిన రాష్ట్ర పురపాలక పట్టణాభి వృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆది మూలపు సురేష్ దృష్టికి కూడా జగనన్నకాలనీ సమస్యను లబ్ధిదారుల దృష్టికి తెచ్చారు. దీంతో మంత్రి సురేష్ అధికారులతో మాట్లాడారు. స్పందించిన అధికారులు బుధవారం హసనబాధ వద్ద లే అవుట్‌లో పరిశీలించారు. అక్కడ ఉన్న సమస్యలను గుర్తించారు. తనను కలిసిన విలేకరులతో సబ్ కలెక్టర్ సేధూ మాధవన్ మాట్లాడుతూ జగనన్న కాలనీ లేఅవుటును పరిశీలించడం జరిగిందని గుర్తించిన సమస్యలను జిల్లా కలెక్టర్కు నివేదిస్తామని ఆయన తెలిపారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి

– మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : వైఎస్సార్ సీపి పార్టీ బలోపేతానికి గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు పాటు పడాలని కనిగిరి మాజీ ఎమ్మెల్యే, కావలి నియోజక వర్గం పరిశీలకులు కదిరి బాబురావు అన్నారు. ముందుగా నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని రైతు బజార్‌ను బుధవారం కావలి శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డితో కలిసి కనిగిరి మాజీ ఎమ్మెల్యే, కావలి నియోజకవర్గం పరిశీలకులు కదిరి బాబురావు సందర్శించారు. రైతు బజారులో సమస్యల గురించి రైతులు, వ్యాపారస్తులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. అలాగే కావలి నియోజకవర్గ స్థాయి జగనన్న క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. జరిగిన జెసిఎస్ మండల ఇంచా ర్జిలు సమావేశంలో కదిరి బాబురావు పాల్గొని మాట్లాడారు. గ్రామ సచివాలయల కన్వీనర్స్, గృహ సారధులు అందరు కలిసి వైఎస్సార్‌సీపీ పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. వైసీపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు గురుంచి ఇంటింటా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించి ప్రజలను చైతన్య వంతులుగా తయారు చేయాలని సూచించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైసీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని అన్నారు. ప్రజలను తిరిగి ఓటు అడిగే హక్కు వైసీపి ప్రభుత్వానికి మాత్రమే ఉందన్నారు. 2024లో కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జెస్, గ్రామ సచివాలయల కన్వీనర్స్, గృహ సారథులు పాల్గొన్నారు.

వినయ్‌రెడ్డి మెమోరియల్ టోర్నమెంట్

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని హాజీపురం గ్రామం నందు నూతన సంవత్సరం మరియు సంక్రాంతి పండుగ సందర్భంగా హనుమంతునిపాడు, వెలిగండ్ల మరియు సియస్ పురం మండల స్థాయిలో పోట పోటీగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంటును నిర్వహించిన గాయం బ్రదర్స్ అండ్ వినయ్ రెడ్డి మెమోరియల్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని మేనేజ్ మెంట్ తెలియజేశారు. ఈ ఆటలు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేసే దాత మొదటి బహుమతి గాయం సుబ్బారెడ్డి 20,116 రూపాయలు, రెండవ బహుమతి అందజేసే దాత గాయం సుధాకర్ రెడ్డి 15,116 రూపాయలు, మూడవ బహుమతి అందజేసే దాత గాయం నారాయణరెడ్డి 10,116 రూపాయలు అందచేయడం జరుగుతుందని మేనేజ్ మెంట్ తెలిపారు. ఈ కార్యక్రమానికి టెంట్ హౌస్ దాత గాయం నారాయణరెడ్డి సన్స్, అదేవిధంగా మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మెడల్స్ మరియు స్టీల్స్ దాత గాయం సునీల్‌రెడ్డి అందచేయడం అయిందన్నారు. అలానే ఈ కార్యక్రమానికి మేనేజ్ మెంట్ కార్య నిర్వాహకులు సునీల్‌రెడ్డి శివారెడ్డి రాజారెడ్డి రమేష్ రెడ్డిలు కలసి నిర్వహిస్తున్నారు. ఈ బహుమతులన్నీ 16వ తేదీన సోమవారం ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందని కమిటీ సభ్యులు ఒక ప్రకటన తెలియజేశారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : కెవిఎస్ఎల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ నందు సంక్రాంతి సంబరాలు బుధవారం అంబరాన్ని అంటాయి. బుధవారం రంగురంగుల రంగవల్లులతో పాఠశాలను విద్యార్థులు సుందరంగా తీర్చిదిద్దారు. భోగి మంటలు వేసి కేరింతలు కొట్టారు. పతంగులు ఎగరవేసి ఆనందాన్ని వ్యక్తపరిచారు. అప్పుడే సంక్రాంతి వచ్చిందా అన్నట్టు పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అద్భుతంగా జరిగాయి. రంగవల్లుల పోటీలు నిర్వహించి విద్యార్థినులకు బహుమతి ప్రధానం చేశారు. ఓవరాల్ విభాగంలో 9వ తరగతి విద్యార్థి డి. ప్రియాంక ప్రథమ బహుమతి సాధించారు. షేక్ అమీదా, బి.భవాని, ఎస్. దీపికా వరుసగా ద్వితీయ, తృతీయ, చతుర్ద బహుమతులు పొందారు. మూడవ తరగతి నుండి 5వ తరగతి వరకు విభాగంలో కె .శ్రావ్య, ఏ. మౌనిక, వై. నిషిత లు, 6, 7, 8 తరగతి విభాగంలో ఆర్. విజయలక్ష్మి, టి. హరిత, వి.లావణ్యలు, 9 నుంచి ఇంటర్మీడియట్ విభాగంలో కే. మాధవి, పి.రాధ, సిహెచ్ సంధ్యాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఇరగని మాధవరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకట్రావు, పీజీటీలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5 లక్షల ఎల్‌ఓసీ లెటర్‌ను అందించిన మంత్రి సురేష్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మండలం చిన్న దోర్నాల గ్రామానికి చెందిన నూతన జంట ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, నూతన వధువు కోటేశ్వరి కోమలోకి వెళ్లిన విషయం విధితమే. నిరుపేదలు అవడం వైద్యం లక్షల్లో అవడం దిక్కుతోచని స్థితిలో ఉన్న వారిని.. దాతల సహకారంతో కొంత నగదును హాస్పటల్లో కట్టారు. అదే విధంగా దోర్నాల వైసిపి మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, గంటా గురువారెడ్డి, ఎంపీపీ గుమ్మా పద్మజా యల్లేష్, వైస్ ఎంపీపీ నాగయ్య, వైసిపి నేతలు, చిన్న దోర్నాల గ్రామస్తులు రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ దృష్టికి తీసుకెళ్లగా... వెంటనే స్పందించిన ఆయన హెల్త్ సెక్రటరీతో మాట్లాడి 5లక్షల ఎస్టి మేషన్ ఎల్‌ఓసి లెటర్‌ను మంత్రి సురేష్, ఆయన తనయుడు ఆదిమూలపు విశాల్ స్వయంగా కోటేశ్వరి కుటుంబ సభ్యులకు అందించారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌కు, సహకరించిన దోర్నాల మండల వైసీపీ నాయకులకు కోటేశ్వరి కుటుంబ సభ్యులు, చిన్న దోర్నాల, మార్కాపురం మండలం రాజుపాలెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

గంజాయి మొక్కలను పెంచితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని చింతలపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో గల టేకులపెంట గ్రామాన్ని మంగళవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, స్థానిక ఎస్ఐ సుబ్బరాజు సందర్శించారు. గ్రామస్తులకు సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఎస్ఐ సుబ్బరాజు మాట్లాడారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే వారిపై చర్యలకు ఉపక్రమిస్తామని, ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా సమాచారం అందించాలని తెలిపారు. మార్కాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి శ్రీనివాస్ నాయుడు, గిద్దలూరు ఎస్ఇబీ సీఐ అరుణ కుమారి, పోలీస్ సిబ్బంది, అడవి అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-చీరాల : పేరాల హైస్కూల్, అసఫ్ అలీ ఉర్దు పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగ ను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రాభరణాలు, రంగవల్లులు,గాలిపటాలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. పిల్లలకు పండుగ విశిష్టతపై అవగాహన కల్పించేందుకే ముందస్తు వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్ ఫైరోజ్ భేగంలు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్, కుమార్, అమరా వెంకటేశ్వరరావు, శివ ప్రసాద్, వెలుగొండారెడ్డి, పవని భానుచంద్రమూర్తి, సిహెచ్ మాధవి, వి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొలంబో కందితో అధిక దిగుబడి

విశాలాంధ్ర-తాళ్లూరు : కొలంబో రకం కంది పంటలో యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగుబడితో పాటు అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయాధికారి బి ప్రసాదరావు అన్నారు. మండలంలోని వెలుగు వారి పాలెం గ్రామంలో బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా కొలంబో రకం కంది పంటను పరిశీలించి, రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. డిసెంబర్లో కురిసిన వర్షాల వల్ల పూత రాలిపోయే అవకాశం ఉందని, దీని కొరకు రైతులు యూరియా, పొటాషియం నైట్రేటు, 19- 19 -19 మందులను పిచికారి చేస్తూ, వేప నూనెను, క్లోరో ఫైరీఫాస్ ను పిచికారి చేసి నట్లయితే కొంతవరకు ప్రయోజనం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సుష్మ సుల్తానా, కవిత, గ్రామ రైతులు వెంకట్రావు, బాలకోటి రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : గ్రామ పంచాయతీలలో గ్రీన్ అంబాసిడర్‌లు సేకరిస్తున్న తడి పొడి చెత్తను చెత్త సంపద కేంద్రాల్లో వేసి చెత్త సంపద తయారు కేంద్రాలుగా వినియోగంలో తీసుకురావాలని ఈవోపీఆర్డి పి ఓబులేసు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఓబులేసు మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్మికుల సేకరిస్తున్న తడి పొడి చెత్తను వేరువేరుగా వేసి ఎండబెట్టి ఎరువులుగా తయారుచేసి ఎరువులను విక్రయించిన ద్వారా వచ్చిన నగదును గ్రామ అభివృద్ధికి వినిగించుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చేయాలన్నారు. ఇంటి పన్నులపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించి వాటి వసూళ్లకు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేకాట, కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో ఎవరైనా ఎక్కడైనా కోడి పందాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హనుమంతునిపాడు మండల ఎస్సై జి కృష్ణపావని ఒక ప్రకటనలో హెచ్చరించారు.

బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందాలు, పేకాట, గుండాట వంటి జోధాల జోలికి వెళ్ళవద్దని సంప్రదాయ ఆటలైన కోకో, బ్యాట్మింటన్, టెన్నిస్, క్రికెట్, కబడ్డీ వంటి ఆటలు ఆడుకోవాలని ఎస్సై కృష్ణపావని సూచించారు.

అందరికీ అన్నదానం

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద టీడీపీ కార్యాలయం నందు టీడీపీ ఇంచార్జ్ మరియు మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్ నందు హనుమంతునిపాడు మండల పరిధిలోని నందనవనం గ్రామానికి చెందిన టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి మువ్వా రంగసాయి యాదవ్ బుధవారం పేదలకు స్వయంగా భోజనం వడ్డించడం జరిగింది. మువ్వా రంగసాయి యాదవ్ మాట్లాడుతూ అన్న ఆశయం. చంద్రన్న సంకల్పం...ఉగ్ర అన్న ఆచరణతో పేద ప్రజలకు కడుపునిండా భోజనం అందించాలన్న లక్ష్యంతో డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్న మంచి నిర్ణయం తీసుకున్నారని రంగ సాయి ఉగ్ర అన్నకు ధన్యవాదాలు తెలియజేశారు.

టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎస్ఐ సుబ్బరాజు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 11వతేదీ నుంచి 17 తేదీవరకు సంక్రాంతి పండుగ సందర్భంగా కొమరోలు మండల జడ్పిటిసి సారె.వెంకట నాయుడు, నాదెళ్ల. వెంగయ్య చౌదరిల ఆధ్వర్యంలో నిర్వహించబడిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం కొమరోలు ఎస్సై ఏ.సుబ్బరాజు ప్రారంభించారు. బ్యాటింగ్ అల్లినగరం, గుంతపల్లె, అడుతునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షేక్.మౌలాలి (నన్ను),కొమరోలు ఎంపీటీసీ 1 యం.యస్. సుభాన్,ఎంపిటిసి 3 నాగ దాసరి తిరుపతిరాజు, ఉమ్మడి.వెంకటేశ్వరచౌదరి, చేదుల.రమణరెడ్డి తదితరులుపాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని భ్రమరాంబ మల్లికార్జున డిగ్రీ కళాశాల నందు బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు కళాశాల చైర్మన్ బట్టు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆనందోత్సవాలతో 30 మంది విద్యార్థులు ముగ్గులు వేశారు. వసంత జూనియర్ కాలేజి విద్యార్ధులకు 1,2,3,4,5 బహుమతుల అందజేయటం జరిగింది. భ్రమరాంబ మల్లికార్జున డిగ్రీ కళాశాల విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ బట్టు రమణారెడ్డి విద్యార్థులకు నగదు, బహుమతి, మొదటి బహుమతి శైలు రెండో బహుమతి అశ్విని, డో బహుమతి రమాదేవి, నాలుగో బహుమతి రాధా, ఐదో బహుమతి శ్రావణి, బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థి బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది బాషా, పవన్ మధు, కాశిరాములు నాయక్, మల్లికార్జున, రవి నాయక్, కమలపద్మజ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఆరోగ్య మిత్రుల సమస్యలపై ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌తో ఆరోగ్య మిత్ర సమస్యలపై రాష్ట్ర ఎస్సీ ఎస్టీ యూనియన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పనిచేస్తున్నటువంటి ఆరోగ్య మిత్ర సమస్యలను ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌తో సమస్యల గురించి రాష్ట్ర ఆరోగ్య మిత్ర దళిత గిరిజన, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జి, ప్రకాశం జిల్లా నుండి దోర్నాల రాంబాబు మార్కాపురం కిరణ్ కుమార్ కలిసి ఆరోగ్య మిత్రుల సమస్యలను వివరించడం జరిగింది. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారము ఆప్కాస్‌లో క్యాటగిరి 1 మీకు కేటా ఇస్తామని, చెప్పి హామీ ఇచ్చారు. ప్రభుత్వం మీ సమస్యల గురించి ఫైలు అధికారుల దగ్గర ఉన్నదని, సమస్యను అతి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. త్వరలోనే ప్రభుత్వం నుంచి మంచి శుభవార్త రాష్ట్ర ఆరోగ్య మిత్ర ఉద్యోగస్తులు వింటారని చెప్పడం జరిగింది. బాపట్ల ఎంపీ నందిగం సురేష్, రాష్ట్ర ఆరోగ్య మిత్ర దళిత గిరిజన సమస్యల గురించి ముఖ్యమంత్రికి వివరిస్తానని, త్వరలోనే మీరు మంచి శుభవార్త వింటారు అని ఆయన హామీ ఇచ్చారు.

నిరంకుశ జీఓను పూర్తిగా రద్దు చేయాలి

– సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఒంగోలు : రోడ్లపై సభలు, సమావేశాలు జరపకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నిరంకుశ జీఓను పూర్తిగా రద్దు చేయాల్సిందేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం సిపిఎం జిల్లా ప్లీనరీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిధిగా హాజరైన శ్రీనివాసరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రిటీష్ కాలంలో తెచ్చిన జిఓను ఇప్పుడు తీసుకురావటం దుర్మార్గమన్నారు. ఆనాడే ఈ జిఓను అన్ని వర్గాల ప్రజలతో పాటుగా, మేధావులు, న్యాయవాదులు వ్యతిరేకించారన్నారు. చేసిన తప్పిదాలను దాటవేసేందుకు ఈ చీకటి జిఓను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. దీనిని పూర్తిగా రద్దు చేయటం ప్రజలకు శ్రేయస్కరమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ జిఓను రద్దు చేయాలని ముక్తకంఠంతో చెప్పటం మంచి పరిణామమన్నారు. జిఓ ప్రజా ఉద్యమాలను అణచివేయటం ద్వారా ప్రజానీ కానికందరికీ నష్టం వాటిల్లుతుందని సిపిఎం భావిస్తుందన్నారు. ఈ సమావేంలో సీపీఎం జిల్లా కార్యదర్శి హనీఫ్, రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎస్సై డి.రాజారావు

విశాలాంధ్ర-పొన్నలూరు : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, దర్శి డిఎస్పి, కొండేపి సీఐ ఉత్తర్వుల మేరకు రాబోవు సంక్రాంతిని పురస్కరించుకొని ఎవరైనా కోడిపందాలు గాని, పేకాటలు నిర్వహించడం కానీ లేదా వాటికి సంబంధించిన వస్తువులను కలిగి ఉండటం గాని చేసిన ఎడల చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకొనిబడును. పొన్నలూరు మండలంలో ఏదైనా గ్రామంలో ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడుతున్నారని సమాచారం తెలిసిన ఎడల పోలీసులకి తెలియ పరచవలసిందిగా కోరుతున్నాము అని ఎస్ఐ దాసరిరాజారావు ఒక ప్రకటనలో తెలిపారు.

15 కుటుంబాలు టీడీపీలో చేరిక

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని వద్దిమడుగు గ్రామంలో మంగళవారం రాత్రి మార్కాపురం టిడిపి ఇన్చార్జి కందుల నారాయణరెడ్డి ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా గ్రామంలోని 15 కుటుంబాల వారు వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో నారాయణరెడ్డి ఆధ్వర్యంలో చేరారు. టిడిపిలో చేరిన పిన్నికి శ్రీను గోదేపి రాజు చింతలపూడి శ్రీను తోట భాస్కర్ ఇంటూరి వెంకటేశ్వర్లకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా పంట నమోదుచేసుకోవాలి

విశాలాంధ్ర-కంభం : మండలంలోని చిన్న కంభం ఆర్ బి కే పరిధిలోని దర్గా గ్రామాన్ని మండల వ్యవసాయ అధికారి దుంగ స్వరూప వారి సిబ్బందితో గ్రామ పొలాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ గ్రామ రైతులకు తప్పనిసరిగా పైరువేసిన రైతులు పంట నమోదు చేయించుకోవాలని ఈ నెల 20వ తారీకు లోపల చేయించుకోవాలన్నారు. కంభం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో 4730 ఎకరాలు సాగు చేసి ఉన్నారు, ఇందులో ఇంతవరకు పంట నమోదు 3135 ఎకరాల వరకు పంట నమోదు చేసుకొని ఉన్నారు. మిగిలిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు. రైతులు పంటల విషయంలో ఎటువంటి సమస్యలు ఉన్నట్లయితే పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 155251 ఫోన్ చేసి పరిష్కారం పొందగలరు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-కంభం : కంభం పట్టణంలోని స్థానిక ఎంఎస్ఎన్ కందులాపురం ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను బుధవారం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగరాజు మాట్లాడుతూ తెలుగు వారికి ఎంతో ముఖ్యమైన పండుగ సంక్రాంతి పండుగ అనీ, పంటలు చేతికొచ్చే సమయం కావడంతో రైతులు ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారన్నారు. సంక్రాంతి సంద ర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులతో నిర్వహించిన కోలన్న, శాస్త్రీయ నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిఆర్పీ. రవీంద్ర నాయక్, ఏలం.శేకర్, బాబూరావు ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించిన ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : ఒంగోలు పట్టణంలోని ప్రతిభ కళాశాలలో సిద్దార్థ కరాటే దూ అకాడమీ 41 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అకాడమీ యాజమాన్యం నిర్వహించనున్న ఇంటర్ స్టేట్ కరాటే ఇన్విటేషనల్ ఛాంపియన్ షిప్ - 2023 క్రీడల ఆహ్వాన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా కరాటే అసోసియేషన్ చైర్మన్ మరియు గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై, పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్దార్థ దూ అకాడమీ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు నల్లూరి మోహన్ రావు, ముఖ్య అతిథులు అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, డాక్టర్ గుండవారపు రాఘవ, ఒంగోలు ట్రాఫిక్ డీఎస్పీ విక్రమ్ శ్రీనివాస రావు, మరియు టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఈసీలో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-పీసీపల్లి : ముందస్తు సంక్రాంతి సంబరాలను చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. సంప్రదాయ వస్త్రాలు ధరించిన విద్యార్థులు ఈ కార్యక్రమానికి వన్నె తెచ్చారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా సంక్రాంతి విశిష్టతను నేటి తరానికి అందించేలా సాగిన ఈ సంక్రాంతి సంబరాలలో మొదట సాంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వ హించి ప్రారంభించారు. భోగి మంటలు వేసి భోగి యొక్క విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని భోగిమంటలు చుట్టూ ఆనందోత్సాహాలతో కోలాటం ఆడారు. విద్యార్థులు గాలిపటాలు ఎగురవేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. వంటల పోటీలలో పాల్గొన్న మహిళలు సంక్రాంతి విశిష్టతను తెలిపేలా వివిధ రకాల పిండి వంటకాలను ప్రదర్శించారు. మహిళలకు మ్యూజికల్ చైర్స్, పురుషులకు టంగ్ ఆఫ్ వార్, వంటి అనేక సాంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థినీ, విద్యార్థులతో పాటు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలు ఈ కార్యక్రమానికే హైలెట్గా నిలిచి పండుగ శోభను కళ్ళ ముందు నిలబెట్టాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ఎంతో ఉత్సాహభరితంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించటం హర్షనీయమన్నారు. సాంప్రదాయాలు కను మరుగవుతున్న కాలంలో విద్యార్థులకు వాటి గొప్పతనాన్ని, ఆవశ్యకతను తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించడం అభినంద నీయమన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి రవికుమార్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతిరూపమని తెలిపారు. గ్రామీణులు వ్యవసాయ నేపథ్యంగా జరుపుకునే ఈ పండుగలో ఎన్నో విశిష్టతలు ఉన్నాయని చెప్పారు. నెగిటివ్ ఆలోచనలను భోగిమంటల్లో వేసి ఇకనుంచి సానుకూల దృక్పథంలోకి వెళ్లాలంటూ ఈ పండుగ సూచిస్తుంది అన్నారు. సైన్స్ ప్రకారం చూసిన ఈ పండగకు ఎంతో విశిష్టత ఉందని తెలిపారు. కనుమ కృతజ్ఞతలు చిహ్నంగా జరుపు కుంటామన్నారు. వీటిని నేటి తరానికి అందించాలని ఉద్దేశంతోనే విద్యార్థులను ఈ కార్యక్రమాలలో భాగస్వాములు చేస్తూ సంక్రాంతి సంబరాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలి

సబ్ కలెక్టర్ సేదు మాధవన్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : రెవిన్యూ సిబ్బంది నిబంధనలు పాటించి అధికారులు చెప్పిన పని సకాలంలో చేసి సహకరించి అంకితభావంతో పని చేయాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సేధూ మాధవన్ సూచించారు. పెద్ద దోర్నాల మండలరెవెన్యూ కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దోర్నాల మండలంలోని రెవిన్యూ పనితీరును వీఆర్వోల నుండి అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కులము ఆదాయధ్రువీకరణపత్రాలు నిర్ణయించిన గడువు లోపలలోనే ఇచ్చి ప్రజలకు సహకరించాలని ఆదేశించారు. ఎదవల్లి, పెద్దబొమ్మలాపురం, కటకానిపల్లి, వీఆర్వోల పనితీరుపై సబ్ కలెక్టర్ సేధూ మాధవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల తహసీల్దార్ వేణుగోపాలరావు, మండల సర్వేయర్ సురేష్, విలేజ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల వేద కళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని ఆదర్శ పాఠశాలలో మరియు వేద ఫార్మసీ కళాశాలలో బుధవారం ముందుస్తూ సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ముగ్గులు వేసి ఉత్సాహంగా పాల్గొన్నారు. హరిదాసు వేషా ధరణలో విద్యార్థులు ఆలరించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కే పూర్ణచంద్రరావు. వేద ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏ ఎంఎంఎస్ సుధాకర బాబు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మన వారసత్వ సంపద అని అన్నారు. కొత్త కొత్త అల్లుళ్లతో కొత్త పంటలతో సంక్రాంతి పండుగను ఆనందోత్సాల మధ్య జరుపుకునే వారన్నారు. సాంప్రదాయ విధానాలు కుటుంబ బంధాలను పెంపొందించే సంక్రాంతి పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-కనిగిరి : ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ మార్కాపురం డివిజన్ క్యాలెండర్‌ను మంగళవారం యూనియన్ నాయకులు కనిగిరి దర్శించే భవన్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కనిగిరి గ్రామీణ డాక్ సేవక్ నాయకులు పెన్నా రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ప్రాంతీయ సమావేశంలో ముఖ్య అతిథులు మార్కాపురం డివిజన్ కార్యదర్శి డి నారాయణరెడ్డి, రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితులు డి మీరావాలి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కేబి మీరావలి, మాజీ డివిజన్ నాయకుడు వెంకట కొండయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే డాక్ సేవక్ కార్మికులకు ఎటువంటి సమస్యలు వచ్చినా యూనియన్ తరపున ఐక్యంగా పోరాటాలు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వపరంగా గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులకు రావాల్సిన వేతన బత్యాలు గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే డాక్ సేవకులతో పాటు బీపీఎం, ఏబీపీఎంలో పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ఎస్సీ కాలనీలో గల ఏపి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యా యుడు గాయం కాశిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ సంక్రాంతి సంక్రాంతి పర్వదినం విశిష్టతను గురించి సాంప్రదాయాల గురించి విద్యార్థులకు వివరించారు. సాంప్రదాయాలను ఆచరించాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. భోగిమంటవేసి సరదాగా గడిపారు. హరిదాసు గంగిరెద్దుల గురించి వివరించారు. బాలికలు అందమైన రంగవల్లులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు డాక్టర్ఎస్ కేజీ మస్తాన్ రహీం సాయి లక్ష్మి అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

13 నుంచి వేములలో కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర - ముండ్లమూరు : (మండలంలోని వేముల గ్రామంలో ఈనెల 13 నుండి ప్రకాశం గుంటూరు ఉమ్మడి జిల్లాల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల వైసిపి యువ నాయకు డు బైల దుగు క ృష? యాదవ్ బుధవారం తెలిపారు అందుకుగాను ప్రకాశం గుంటూరు ఉమ్మడి జిల్లాలో పరిధిలో గల కబడ్డీ పై ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ జట్లు వివరాలను ఎంట్రీ ఫీజు 600 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వేములలో నూతన సచివాలయం ప్రాంగణంలో ఈనెల 13 నుండి 16 వరకు కబడ్డీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. మొదటి బహుమతి35116 కాసుల వీరబ్రహ్మం. రెండవ బహుమతి20116 గజ్జల రామ మునలా రెడ్డి. మూడో బహుమతి10116 అన్నపురెడ్డి రమణారెడ్డి. నాలుగవ బహుమతి5116 కుమ్మిత శ్రీనివాస్ రెడ్డిలు ప్రకటించారు. బెస్ట్ రైడర్ కు ప్రత్యేక బహుమతి అందజేయడం జరుగుతుందని అన్నారు.

14, 15 తేదీల్లో జీ తెలుగు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ఒంగోలు : జీ తెలుగులో ఈ సంక్రాంతి పండుగకు మరింత వినోదాన్ని అందిస్తూ జనవరి 14వ తేదీ ఉదయం 9 గంటలకు సంక్రాంతి సంబరాలు మొదటి భాగం ప్రసారం కానుందన్నారు . టీవీ స్టార్స్ లతో పాటు ఎనర్జిటిక్ యాంకర్లు రవి , శ్యామల తమ అద్భుతమైన యాంకరింగ్తో అలరించారని, అంతేకాకుండా కొన్ని ఆహ్లాదకరమైన గేమ్‌లు ఉన్నాయన్నారు. ఆద్యంతం ఆకట్టుకునే కార్యక్రమాలు, జీ కుటుంబ సభ్యుల ఆటాపాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తాయన్నారు. సంక్రాంతి సంబరాలకు ప్రత్యేక అతిథిగా హాజరైన క్యూట్ బబ్లీ మృణాల్ ఠాకూర్ అందరి హృదయాలను గెలుచుకున్నారన్నారు. రెండో భాగం జనవరి 15న సాయంత్రం 6 గంటలకు ప్రసారం అవుతుందని, సీతారామం ఫేమ్ మృణాల్ ఠాకూర్ సంక్రాంతి సంబరాలు ఈ రెండో భాగంలో ఉంటాయన్నారు. ప్రేక్షకుల్లానే, ఆమె కూడా టీవీ స్టార్స్ యొక్క పర్ఫార్మెన్స్‌లు వీక్షించారని, సంక్రాంతి సంబరాల్లో భాగంగా టీవీ స్టార్స్‌ను రెండు టీమ్లుగా విభజించారని, ఈ రెండు టీమ్లకు హరిత, అన్నపూర్ణమ్మ లీడర్లుగా వ్యవహరించారన్నారు. ఈ రెండు టీమ్ల మధ్యే డ్యాన్స్ పర్ ఫార్మెన్సు, ఆటలు, కుండ పగులగొట్టడం, సంక్రాంతి ప్రత్యేక భోజనం వంటి కార్యక్రమాలతో జీ తెలుగు సంక్రాంతి సంబరాలు ప్రేక్షకులకు సరికొత్త ఆనందాన్ని అందిస్తాయనడంలో సందేహం లేదని తెలిపారు.

నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

విశాలాంధ్ర-సంతమాగులూరు : సంకురాత్రి పండుగ సందర్భంగా కొమ్మలపాడు గ్రామంలో ముస్లిం యూత్ తూర్పు బజార్ కుర్రవాళ్ళు అద్దంకి నియోజకవర్గం స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ను 300 రూపాయల ఎంట్రీ ఫీజుతో కొమ్మలపాడు పోలీస్ గ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ శివరామక ృషా?రెడ్డిని ఎస్సై నాగ శివారెడ్డిని ఆహ్వానించడం జరిగింది. అనివార్య కారణాల వల్ల వీరు రాకపోవడంతో గ్రామ సర్పంచ్ మోతాదు మహబూబ్ జానీ ఖాదర్ మస్తాన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వాలీబాల్ టోర్నమెంట్ కు ఇప్పటికీ 40 టీములు ఎంట్రీ ఫీజులు కట్టి నమోదు చేసుకున్నారు మొదటిరోజు పది టీములు పాల్గొన్నారు మొదటి బహుమతి పదివేల 116 లు రెండవ బహుమతి 8వేల 116 లు మూడో బహుమతి 6 వేల 116 లు నాలుగో బహుమతి 4 వేల 116 లు ఐదవ బహుమతి 20 116 లు గెలుపు పొందిన విజేతలకు ఇస్తున్నట్లు కమిటీ సభ్యులు సయ్యద్ అల్లా బక్షు తెలిపారు.

పామూరులో మద్యం పట్టివేత

విశాలాంధ్ర-పామూరు : పామూరు పట్టణంలో సమాచారం మేరకు బుధవారం సెబీ అధికారులు నిర్వహించిన గాడులలో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని వారి వద్ద బుల్లెట్ బైకు, గోవా, కర్ణాటకకు చెందిన 14 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వారిలో వైసీపీకి చెందిన వలంటీర్ ఉన్నట్లు తెలిసింది. కేసు నుండి వాలంటరీను తప్పించాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు వినికిడి.

నేర నియంత్రణలో సీసీ కెమేరాలు కీలకం

– ఎస్సై దాసరి రాజారావు

విశాలాంధ్ర-పొన్నలూరు : నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని పొన్నలూరు ఎస్సై దాసరి రాజారావు అన్నారు. బుధవారం ముండ్లమూరివారిపాలెం సచివాలయం పరిధిలో సచివాలయం మహిళా పోలీస్ బీ శ్రీ లక్ష్మీ ఆధ్వర్యంలో దాతల సహాయ సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఎస్సై దాసరి రాజారావు పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు సహకరించిన తానికొండ తిరుమలరావు, తానికొండ వినోద్, బొప్పరాజు శ్రీలక్ష్మి, ముళ్లమూరి రేవతి, చక్కా వెంకట కేశవ రావు,తానికొండ మహేంద్ర, యంపారాల మాధవరావు, ముళ్లమూరి వెంకటేశ్వర్లులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజారావు మాట్లాడుతూ నేటి సమాజంలో నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలను, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చునని తెలిపారు. యువత సామాజిక సేవా కార్యక్రమంలో పాల్గొని సమాజంలో చైతన్యం తేవాలని అన్నారు.గ్రామంలో ఉన్న కోదండ రామాలయాన్ని సందర్శించి, రామాలయంలో ఉన్న సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ బి శ్రీలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు. త్వరలోనే దాతల సహాయంతో ముండ్లమూరి వారి పాలెం గ్రామంలో మరికొన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

విశాలాంధ్ర-యద్దనపూడి : క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్ఆర్సిపి నాయకులు అన్నారు. మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో మండల వైసీపీ నాయకులు సమావేశమయ్యారు. వారు ఈ నెల 13వ తేదీన పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో నిర్మిస్తున్న టీటీడీ కళ్యాణ మండప శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతున్న టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించిన ఆమంచి కృష్ణమోహన్‌కు స్వాగతం పలికే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చుండి లక్ష్మీనారాయణ, గోరంట్ల సాంబయ్య, మువ్వల రాంబాబు, దొడ్డ బ్రహ్మానందం, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాలు తనిఖీ

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి వై విజయభాస్కర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ పొందిన దుకాణాలు నుండి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. అదేవిదంగా తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. బిల్లులు ఎవరైనా ఇవ్వని యెడల మండల వ్యవసాయధికారికి తెలియజేయాలన్నారు. దుకాణాదారులు తప్పనిసరిగా ఓ-ఫారంలు, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్స్ లైసెన్స్ నందు పొందుపరుచుకోవలెనని సూచించారు. లేని యెడల వాటి పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని సూచించారు. ఓ-ఫారం మరియు ప్రిన్సిపుల్ సర్టిఫికెట్ లేని కొన్ని ఎరువులు, పురుగు మందులు అమ్మకాలు నిలుపుదల చేయండి జరిగిందని తెలిపారు. ఎవరైనా ఎరువులు, పురుగు మందులు ఎంఆర్‌పి ధరలు కన్నా ఎక్కువకు అమ్మినయెడల వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేసారు.

భారతి కళాశాలలో ఫ్రెషర్స్ డే

విశాలాంధ్ర-చీరాల : విద్యార్థులు తమ విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకుని కృషి పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యతో పాటు విద్యేతర రంగాలలో రాణించి తనకు తానుగా అభివృద్ధి చెంది సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సీఐ మల్లిఖార్జునరావు అన్నారు. చీరాలలోనీ భారతి డిగ్రీ కళాశాలలో బుదవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ.కార్యక్రమానికి డైరెక్టర్ బ్రహ్మయ్య అధ్యక్షత వహించగా సర్కిల్ ఇన్స్పెక్టర్ వి మల్లిఖార్జునరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపల్ జయశంకర్ ప్రసాద్, అధ్యాపకులు రమేష్,డాక్టర్ జె అనురాధ, రోశయ్య,సురేష్, శివప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

– టీడీపీ ఇన్చార్జి కందుల

విశాలాంధ్ర-కొనకనమిట్ల : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకొస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని మార్కాపురం టిడిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగరాజ కుంట ఎస్సీ కాలనీ వద్దిమడుగు గ్రామాల్లో పర్యటించి ఈ సందర్భంగా మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని పెట్రోల్ డీజిల్ నిత్యవసర సరుకులు ధరలు వంట గ్యాస్ బస్ చార్జీలు పెంచి సామాన్య ప్రజలను నడ్డి విరిసిందన్నారు. వస్తూ వస్తున్న పింఛన్లను తొలగించి పింఛన్ లబ్ధిదారులు ఉసులు పోసుకున్న జగన్ ప్రభుత్వం అంతమవడం ఖాయమన్నారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు జరగడంలేదని టిడిపి అధికారంలోకి వస్తే మార్కాపురం ను జిల్లాగా చేసేందుకు కృషి చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టును కూడా పూర్తి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. తానున్న ఎన్నికల్లో తమను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటా తిరుగుతూ ఎండగట్టారు కందులకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు ఎం బాబురావు, మాజీ ఏఎంసీ చైర్మన్ రామలింగయ్య, మాజీ అధ్యక్షుడు కనకం నరసింహారావు, కాశిరెడ్డి, గోట్లగట్టు సర్పంచి సుక్‌దేవ్, శ్రీకాంత్, బట్టు రామారావు, ఐటిడిపి అధ్యక్షుడు పెరికరత్నం, సుబ్బారావు, త్రిపురాంతకుడు, శంకర్, దేవిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పుల్లారెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి సచివాలయం నందు బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీటీడీ పాలకమండల సభ్యులు మరియు కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ గ్రామంలో పర్యటిస్తూ ప్రతి గడపకు వెళ్లి అమ్మ బాగున్నారా.... అక్క ఎలా ఉన్నారు.... అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు కదిలారు అదేవిధంగా అడుగడుగున ప్రజలకు సంక్షేమ పథకాలను గురించి వినిపిస్తూ ఎమ్మెల్యే బుర్ర మాట్లాడుతూ భారతదేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు,ఉద్యోగాలు క్యాలెండర్ ప్రవేశపెట్టి పేద, బడుగు,బలహీన వర్గాలకు సంతృప్తి స్థాయిలో సంక్షేమ పథకాలను అందించడం జరిగిందని తెలిపారు. అలానే గత మూడు సంవత్సరాలలో 7 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని అన్నారు.అలానే చంద్రబాబు గెలిచి రాష్ట్రాన్ని దోచుకోవాలని దుర్మార్గపు ఆలోచనలో ఉన్న వ్యక్తిని అటువంటి వ్యక్తిని ఓటుతో తరిమికొట్టాలని ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ గాయం సావిత్రి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, యక్కంటి శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ భవనం క ృషా?రెడ్డి, తిమ్మారెడ్డిపల్లి వైసీపీ ఇంచార్జ్ కస్తాల బాలాజీ, మండల మహిళా అధ్యక్షురాలు కస్తాల బేబీ,మాజీ సర్పంచ్ పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ రుద్రపాటి శోభ, బెంజిమాన్,ఆదినారాయణ,కత్తి కిషోర్,కత్తి తిరపాలు, గురు ప్రసాద్, సర్పంచ్ కలుకూరి దేవకరునమ్మ,కత్తి రాజారావు, ఎంపీడీవో జీ కృష్ణారావు, ఎస్సై జి కృష్ణపావని, సచివాలయ పంచాయతీ సెక్రెటరీ కాజా నాయబ్ రసూల్, మరియు సచివాలయ సిబ్బంది తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో జడ్పీ హైస్కూల్ నందు ముందస్తు సంక్రాంతి పండుగ పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులకు, ఆటల పోటీలు మరియు ముగ్గుల పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంఈఓ జి. పెద్దిరాజు మరియు కీర్తిశేషులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి మేనల్లుడు పిఎసి చైర్మన్ సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి పాల్గొని వారి చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆటలు పోటీలు గెలుపొందిన విద్యార్థులకు వారి చేతుల మీదుగా బహుమతులు అందచేయటం జరిగింది. అదేవిధంగా సీతారాంపురం హై స్కూల్ నుంచి గత విద్యా సంవత్సరంలో త్రిబుల్ ఐటీ సాధించిన ఐదుగురు విద్యార్థులకు 2000వేల రూపాయలు చొప్పున చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా బహుకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్రమణ్యం మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.